పొలం బడితో రైతులకు ఉపయోగాలెన్నో

- పొలం వద్దకే వచ్చి అధికారుల సూచనలు
- దిగుబడి పెరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మొగల్తూరు వరి చేలను సందర్శిస్తున్న అధికారులు (ఫైల్)

మొగల్తూరు: మండలంలోని రైతులు ఎన్నో ఏళ్లగా వరిసాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే సాగులో మెళకువలు తెలియక మూస పద్ధతిలో సాగు చేయడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మేలైన సేవలను అందించారు. అయితే గ్రామస్థాయిలోనే వ్యవసాయ సిబ్బందిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో ప్రస్తుతం మండల అధికారులు, గ్రామ స్థాయి అధికారులతో కలిసి పొలం బడి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. సాగులో రైతులకు మెళకువలు నేర్పడమే ప్రధానం అంశంగా రూపొందించిన ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుంది.

ఎంపిక చేసిన గ్రామాల్లో నిర్వహణ

ప్రతి సోమ,మంగళ, బుధవారాల్లో ఎంపిక చేసిన గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని సాగు చేపట్టిన గ్రామాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. సెప్టెంబర్ 2024 నుంచి డిసెంబర్ 2024 వరకు పొలం బడి నిర్వహణ ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు.

దిగుబడి పెంచడమే లక్ష్యం

రైతులకు అందుబాటులో ఉన్న పద్ధతులను ఉపయోగించి సాగులో ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించేలా ప్రభుత్వం పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మొగల్తూరు మండలంలో 1365 ఎకరాలు, నరసాపురం మండలంలో 5,500 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టారు. పొలం బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీ వివరాలపై రైతులకు అవగాహన కల్పించడం, ఎరువులు, పురుగుమందులు వాడకాన్ని తగ్గించి మిత్ర పురుగుల సంరక్షణ, సేంద్రీయ సాగుపై సూచనలు అందించేలా కృషి చేస్తున్నారు. అంతేకాక పెట్టుబడి తగ్గించి దిగుబడిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌బీకేలను వినియోగించుకుంటున్న రైతులు

మొగల్తూరు మండలంలో 18, నరసాపురం మండలంలో 23 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. విత్తనం నాటి నుంచి పంట చేతికోచ్చే వరకు రైతుకు కావల్సిన పూర్తి సహాయం అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. దీనికి తోడు వారంలో మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పొలాలు పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందించేందుకు పొలం బడి కార్యక్రమం నిర్వహించడంపై రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొలంబడితో సాగు సమస్యలు తీరాయి



రైతు భరోసా కేంద్రాలతో పాటు పొలం బడి కార్యక్రమం నిర్వహించాలని అధికారులు నిర్ణయించడం హర్షణీయం. అధికారులు రైతులకు అందుబాటులో ఉండటం ద్వారా రైతులకు సమయం ఆదా అవుతుంది. ముఖ్యంగా పొలం బడి కార్యక్రమం ద్వారా సాగు సమస్యలు తీరాయి.

కైలా సుబ్బారావు, మొగల్తూరు

వ్యవసాయంపై అవగాహన



విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికోచ్చేవరకు వ్యవసాయాధికారులు తమకు సలహాలను అందించడంతో ద్వారా వ్వవయసాయంపై అవగాహన కలుగుతుంది. ముఖ్యంగా తెగుళ్లపై అధికారుల సూచనలకు అనుగుణంగా మందులను వాడుతున్నాం.

– గూడూరి మావుళ్ళు, నవుడూరిగరువు

సాగుపై అవగాహన కల్పిస్తున్నాం



ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాక ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలను వివరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెట్టుబడిని తగ్గించి దిగుబడి పెంచేలా కృషి చేస్తున్నాం.

– అబ్దుల్ రహమ్, మండల వ్యవసాయాధికారి

గ్రామాల్లో దసరా సరదా షురూ

నరసాపురం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలో మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి పూజలు ప్రారంభించారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద 40వ దేవీ శరన్నవరాత్రి వార్షికోత్సవాలను వేడుకగా ప్రారభించారు. అమ్మవారు శ్రీశైలపుత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి సభ్యులు మండెల సత్యనారాయణ, గునిశెట్టి సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాయిపేట పుంతలోముసలమ్మ అలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కావలి రామ సీత దంపతులు పూజలో కూర్చున్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో గురువారం దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, బుజ్జి దంపతులు పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. మున్సిపల్‌కార్యాలయంలో దసరా వేడుకలు నిర్వహించడం ఆనవాయితాగా వస్తోంది. నవరాత్రులు ముగిసిన తరువాత ఏనుగు ఉత్సవంతో వేడుకలు ముగుస్తాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ ఎం.అంజయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: దేవీనవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల్లో గురువారం కన్నుల పండువగా వేడుకలు చేసుకున్నారు. మొదటి రోజున లిఖితపూడి గ్రామలోనూ, వేములదీవి వెస్ట్ గ్రామం కాపులకొడప సెంటర్‌లో ఏర్పాటుచేసిన దుర్గమ్మ అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించిన తీరు ఆకట్టుకుంది. పితాని మెరకలోని జాజులమ్మ ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు అట్టహాసంగా నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. చినమైనవానిలంక, తూర్పుతాళ్లు గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో భక్తుల తాకిడితో రద్దీ నెలకొంది. సారవలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దేవీ శరన్నవరాత్రులు గురువారం నుంచి ఘనంగా ప్రారంభయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లోనూ, ప్రధాన కూడళ్లలూనూ ఏర్పాటు చేసిన అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారిని లలితాత్రిపుర సందురీదేవిగా అలంకరించి పూజలు చేశారు. మొగల్తూరు కూరగాయల మార్కెట్ ప్రాంతంలోనూ, ముక్కువారివీధిలోనూ అమ్మవారిని లలితాత్రిపుర సుందరదేవిగా అలంకరించారు.

పెనుగొండలో..

పెనుగొండ: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో అమ్మవార్లను తొలి రోజు గురువారం శ్రీబాల అలంకరణల్లో దర్శనం ఇచ్చారు. పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిషాసురమర్దనీ, వాసవీమాతలను శ్రీబాల అవతారంగా అలంకరించారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో మరకత శిల వాసవీ మాతను శ్రీబాల త్రిపుర సుందరిగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: హిందువులంతా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ప్రధాన పండుగలలో ఒకటైన దసరా శరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రతి గ్రామంలోను ప్రధాన కూడళ్లలో కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం దంపత సమేతంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. మేడపాడు మాజీ సర్పంచ్ ఓదూరి కృష్ణమూర్తి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద మొదటి రోజు వైఎస్సార్ సీపీ నాయకుడు అడబాల రామ్మోహనరావు, సత్యవేణి దంపతులు పీటలపై కూర్చున్నారు. ఈ సందర్భంగా వీరికి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, వెంకటేశ్వరరావు దంపతులు నూతన వస్త్రాలు సమర్పించి ఆశీర్వదించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూలపల్లి మురుగు కాలువ వద్ద వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద గ్రామ పెద్దలు బీహెచ్ వెంకటేష్ వడయార్ – వరలక్ష్మి, రేలంగి శ్రీనివాసరావు-భవాని దంపతులతో విగ్రహ ప్రతిష్ట, కలశ పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే సాయంత్రం హోమాలు నిర్వహించారు. శివదేవునిచిక్కాల బస్టాండ్ సెంటర్, పాలమూరు, తిల్లపూడి, సగంచెరువు, పెదమామిడిపల్లి, దిగమర్రు, పూలపల్లి గంటాలమ్మ గుడి వద్ద, ఉల్లంపర్రు, దగ్గులూరు, చింతపర్రు, కాపవరం తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నెగ్గిపూడిలోని నరసాపురం కాలవ ఒడ్డున మెయిన్ రోడ్డు పక్కనే వేంచేసి ఉన్న శ్రీ వణువులమ్మ, శ్రీ కనకదుర్గమ్మ ఆలయాల వద్ద కీర్తి కనకయ్య దంపతులు, అల్లం భాస్కర్ రెడ్డి దంపతులు కలశ స్థాపనలు చేసి అమ్మ వార్ల ఉత్సవ ప్రతిమలను ప్రతిష్ఠించిన అనంతరం శ్రీ చక్ర, కుంకుమ పూజలను నిర్వహించారు. నత్తారామేశ్వరంలోని శ్రీ విజయ దుర్గ ఆలయం వద్ద, పెనుమంట్ర మార్టేరు లోని శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయాల వద్ద అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజ ప్రారంభించారు. శ్రీ మావుళ్లమ్మ ఆలయం వద్ద దేవాంగుల సంక్షేమ సంఘం, శ్రీ కంచి కామాక్షి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వెలగల వారి పాలెం గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద సర్పంచ్ ఎలాగల బుల్లి రామిరెడ్డి సుగుణ దంపతుల శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: దేవిశరన్నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలో పలు కూడళ్లలో అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటుచేసి కలశస్థాపన చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. స్థానిక యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. స్థానిక వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు పురస్కరించుకుని ఉదయం 102 కలశాలతో మహిళలు, యువతులు వాసవి మాత ఊరేగింపు నిర్వహించారు.


పెనుగొండ: బాల అలంకరణలో పెనుగొండ మహిషాసురమర్దనీ దేవి


నరసాపురం: పండ్ల మార్కెట్ వద్ద ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ


నరసాపురం రూరల్: లిఖితపూడి గ్రామంలో ప్రతిష్ఠించి అమ్మవారి విగ్రహం


పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో కలశ పూజ చేస్తున్న భక్తులు


యలమంచిలి: మేడపాడులో పూజలు చేస్తున్న భక్తులు


మొగల్తూరు: ముక్కువారివీధిలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

మొగల్తూరు తహసీల్దార్‌గా రాజకిశోర్


తహసీల్దార్ రాజకిశోర్‌ను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

మొగల్తూరు: మొగల్తూరు మండల తహసీల్దార్‌గా కె.రాజకిశోర్ గురువారం భాద్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా పని చేసిన సీహెచ్ విద్యాపతి స్థానంలో రాజకిశోర్ బాధ్యతలు చేపట్టారు. ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ డివిజన్‌లోని వీరుల్లపాడు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై మొగల్తూరు మండల తహసీల్దార్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రాజకిశోర్‌ను డీటీ నరేష్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు.

రేపటి నుంచి బస్‌పాస్‌ల జారీ నిలిపివేత

నరసాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్‌ల జారీ కౌంటర్లు ఈనెల 5,6 తేదీల్లో పని చేయవని నరసాపురం ఆర్టీసీ డిపోమేనేజర్ ఎస్. సుబ్బన్నరెడ్డిచెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా రెండురోజుల పాటు కౌంటర్లను మూస్తున్నామని చెప్పారు. మళ్లీ సోమవారం నుంచి కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని విద్యార్థులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానాలను కొనసాగించాలి


విలేకరులతో మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజు

పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ ఆలోచనా విధానాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మాలమహనాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు కోరారు. గురువారం పాలకొల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్ని దళితవాడల్లో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు, ఇతర సామాజిక అవసరాలను తక్షణం పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పనులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాలని పుష్పరాజు కోరారు. సమావేశంలో జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మద్రిపూడి నాని బాబు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో సీపీఎం ధర్నా

పెనుగొండ: విశాఖ ఉక్కు ప్యాక్టరీ అమ్మకాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం పిలుపు నిచ్చారు. గురువారం సిద్ధాంతంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి, రావిచెట్టు సెంటర్‌లో ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, పీవీ ప్రతాప్, కొరు పెద్దిరాజు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుని ఆలయంలో కలశ స్థాపన పూజలు


కలశస్థాపన, లక్ష కుంకుమార్చన చేస్తున్న పురోహితులు, భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 8.15 గంటలకు కలశ స్థాపన చేశారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న, ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబుల సమక్షంలో పార్వతి దేవి ఆలయంలో కలశస్థాపన చేశారు. అనంతరం పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు. భక్తులు ఉదయం నుంచి ఆలయానికి విచ్చేసి అమ్మవారి కలశస్థాపన పూజా కార్యక్రమాలను తిలకించారు. లక్ష కుంకుమార్చనలో యాదంరెడ్డి అప్పాజీరావు, గాదె సుబ్బారావు, బాలి ఏడుకొండలు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముత్యాల శ్రీనివాసరావు, సూపరింటెంట్ పసుపులేటి వాసు పాల్గొన్నారు.

రైళ్లను కేటాయించాలని కేంద్ర మంత్రి వర్మకు వినతి

పాలకొల్లు సెంట్రల్: హిందువులు ఎంతో పవిత్ర ప్రదేశంగా భావించే కాశీ, అయోద్య ఆలయాల దర్శనం కొరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం నరసాపురం నుంచి ఒక ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని కోరుతూ కేంద్ర ఉక్కు పరిశ్రమల శాఖా మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందించినట్లు విజయవాడ జోన్ డీఆర్‌యూసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. గురువారం భీమవరంలో కేంద్ర మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించామన్నారు.

హరిబాబుకు సత్కారం

పాలకొల్లు అర్బన్: అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా అవార్డును జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు అందుకున్న సందర్భంగా గురువారం పీహెచ్‌సీ ఆవరణలో హరిబాబును శాలువాతో సత్కరించి అభినందించారు. మెడికల్ ఆఫీసర్ డా.నవ్యజీవన్, ఫార్మాసిస్ట్ పీవీ స్వామి, హెచ్‌వీ డి కమల, సీనియర్ అసిస్టెంట్ రమేష్‌బాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

పాలకొల్లు అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఉల్లంపర్రు మాంటిస్సోరీ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. గత నెల 25న ఏలూరులో జరిగిని ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ ఎంపికలో బాలికల విభాగంలో జి.రేణుక, అలాగే 28న మార్టేరు జరిగిన అండర్-14 బాలుర విభాగంలో టి.ప్రశాంత్, కె.శ్యామ్‌కిరణ్ ఎంపికయ్యారు. త్వరలో పల్నాడు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పశ్చిమ గోదావరి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని మాంటిస్సోరీ అడ్మినిస్ట్రేటర్ ఎంఎస్ వాసు, ప్రిన్సిపాల్ ఎస్.వసంతలక్ష్మి తెలిపారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


నరసాపురం రూరల్: రైతులకు సూచనలిస్తున్న అధికారులు


యలమంచిలి: నారినమెరకలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటించి వ్యవసాయం చేస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ ఈదా అనిలకుమారి అన్నారు. గురువారం చిన మామిడిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ సామ్యూల్ జాన్సన్ మాట్లాడుతూ సస్యరక్షణ, యాజమాన్య పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే వ్యయం తగ్గుతుందన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా పురుగుమందులు పిచికారీ విధానాన్ని గురించి రైతులకు ఆయన వివరించారు. వీపీఏ పవన్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో హరినాథ్ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ప్రస్తుతం వరి పొలంలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఎక్కువగా కనిపిస్తుందని దీని నివారణకు రైతులు త్వరగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిందులూరి దేవి కోరారు. నారినమెరక, కట్టుపాలెం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు దేవి పలు సూచనలు చేశారు.

ఎలుకల మందు పంపిణీ

పెనుగొండ: సామూహిక ఎలుకల నిర్మూలనకు ఇలపర్రులో గురువారం ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు, ఎ.వెంకటేశ్వరరావు, పాతపాటి సూర్యనారాయణ రాజు, పాతపాటి రామరాజు, ఎన్ఎస్‌రాజు, నూకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ కమిటీలను బలోపేతం చేయాలి



విజయవాడలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తో పాలకొల్లు నియోజకవర్గ నాయకులు

పాలకొల్లు అర్బన్: జిల్లా యూత్ కమిటీలను బలోపేతం చేసి పార్టీకి అండగా యువతను నిలబడేలా చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబుకి దిశానిర్దేశం చేశారు. గురువారం విజయవాడలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, తదితరులు జగన్‌ను కలిశారు. మూడు నెలల కాలంలోనే కూటమి చేసిన మోసాలను ప్రజలు గ్రహించారన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేయడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వేణు


మాజీ సీఎం జగన్‌తో వేణుమాధవ రెడ్డి

పెనుగొండ: మాజీ సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డిని విద్య మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ మాజీ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని ఓ కార్యక్రమంలో మాజీ సీఎం జగన్ కలిసిన అనంతరం పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అండగా ఉండాలని కోరారని పేర్కొన్నారు.

బాధితులకు రంగనాథరాజు పరామర్శ


పెచ్చెట్టి శ్రీను చిత్రపట్టం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పెచ్చెట్టి శ్రీను కుటుంభాన్ని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. గురువారం ఆచంటలో శ్రీను చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోట వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి సత్యనారాయణ, కుక్కల కిరణ్‌కుమార్, వేమన అప్పారావు, చుట్టూరుసత్యనారాయణ, కడలి చిన్న, పెద్దిరాజు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు కుసుమే రాంబాబు తల్లి రత్నమ్మ మృతి చెందడంతో శ్రీరంగనాథరాజు గురువారం వారిని పరామర్శించారు. నల్లిమిల్లి వేణుమాధవ రెడ్డి, పలివెల శ్రీను, సాకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. దేవ శివారు వంగతాళ్ల చెరువకు చెందిన వైఎస్సార్ సీపీ నేత యార్లగడ్డ జగన్నాథం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో శ్రీరంగనాథరాజు పరామర్శించారు. సర్పంచ్ నల్లారి సత్యనారాయణ, ఉప సర్పంచ్ సాకా సుబ్రహ్మణ్యం, సుంకర సీతారామ్ పాల్గొన్నారు.

రామలింగేశ్వరరెడ్డికి పరామర్శ

పెనుమంట్ర: మండలంలోని నత్తరామేశ్వరం గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి భార్య సాయి వెంకటలక్ష్మి కాంతం ఇటీవల మృతి చెందారు. గురువారం రామలింగేశ్వరరెడ్డి ఇంటికి వెళ్ళిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముందుగా లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: కళాశాలలో క్రీడాకారులకు వాకర్స్ క్లబ్ అందించే సహాయ సహకారాలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. గురువారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇటీవల నరసాపురం వైఎన్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనభరిచిన విద్యార్థినులను అభినందించారు. విజేతలకు వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు పాల్గొన్నారు.